బసివి "మగవాని ప్రేమ! మగవాని పరిమళం! మగవాని అందం!" అంది.

సభంతా నవ్వుతూ కరతాళధ్వనులు గావించి లేచారు. బసివి చంకనున్న బుడుతడుకూడా తన చిట్టిచేతులు తట్టుకోబోయి నాడు. కాని వాని చేతులకు వాని మెడలోని పూసలదండ అడ్డొచ్చింది. అయినా వాని కరతాళధ్వనికి ప్రత్యామ్నాయంగా వానిమీది మహదాకాశం ఉరుముతూ ఉరిమింది; అందరూ పైకి చూచేరు. ఆ సభమీద ఒకానొక చల్లని మొయిలు విరంతర యానం గావిస్తూ కుముద్వతిమీద అమృతపు చినుకు కురిసింది.

కుముద్వతి బసివితో "నాటికి నేడు విన్నాను మళ్ళీ నీ గొంతు బసివీ!" అంది బసివి "అవునంటారా! కాదంటారా? అగ్గిపుల్లా లేక ఒడీ లేపాతే చచ్చిపోమండీ మేం. సెప్పండి?" అంటూ వెర్రి నవ్వులు నవ్వుకుంటూ, బిడ్డని పెదవులకు తన చేపొచ్చిన పాలిండ్లందిచ్చుకొంటూ "సెలవు తల్లీ!" అని వెళ్ళిపోయింది.

బసివి బిడ్డడు తనను వెనుదిరిగి చూస్తూవుంటే కుముద్వతి అభినందనపూర్వకంగా "రా! రా!" అంది. కాని వస్తాడా? కావాలంటే కలుగుతారా బిడ్డలు?

## గానుగెద్దు

నా పంజ చూడ్డానికి చాలా చిన్నదిగా అగుపించినా అదిపోసి, అది, నూనెతీసే గానుగ మిక్కిలి గొప్పదిగాను, పెద్దదిగాను, పేరుకీర్తులు కలదిగాను కనబడుతుంది. సున్నపుగానుగ అంటారుగాని దానికి మొత్తం సున్న, చెరుగ్గానుగంటారు. గాని దానికి మొత్తన హుళక్కి.

కాని తెలుకుల గానుగ అనగా నువు పప్పు ఆడి నూనితీవే గానుగ యొక్క పొంకం, బింకం, చాయ, వాయ, చెప్పదగ్గ విషయాల్లోనివి. ఆ గానుగునంటి వ్యాసంగా తిరిగే బల్లకూడా తదను గుణ్యంగా పెద్దదే. ఆ బల్లను లాగుతూవుండే గానుగెద్దుకూడా బలమైందీ, ఒక రకమైన అలవాటు చూపు గలదీ, ఒక విధమైన నడకగలదీ అయియుండాలి. అన్నిటికంటె అనుకోదగ్గది ఆ గానుగ కిర్రు. ఆ గానుగదగ్గర కూర్చుంటే వేసే కమ్మని దిగుదాయి నూనె ఘుమాయింపు.

ఇక నువ్వులు పప్పుగాజేసే తెలుకుల సత్తెయ్య అంటూ వుంటాడు! అతన్నెప్పుడన్నా చూచేరోలేదో పేద్ద జంగిడిబుట్టతో పప్పు కడిగి చెరువుగట్టుమీద గోచిపాతతో అంత ఆజానుబాహువు మనిషి నిటాగ్గా నిలబడి పప్పారబోస్తూంటే నల్లని శరీరం అతనూ కోరుకొండ కొండమీది రెడ్డివిగ్రహంలా గగపిస్తాడు!

"ఇతడేనా ప్రతివాది?" అన్నాడు అమీనా వెంకన్న ఊళ్లోకి ప్రవేశిస్తూ తనతోవున్న వాదిగారితో. అమీనాతోవున్న వాదిగారిదీ ఆ గ్రామమే! వాదిగారిపేరు వేదాల పనసయ్యగారు. ఆయన బ్రాహ్మణులు. బ్రాహ్మణుల్లో లౌక్యులు, లౌక్యుల్లో మంచి వడ్డీ వ్యాపారం గలవారు. పనసయ్యగారికి వయస్సు ఏభై యేళ్ళు రమారమీ వుంటాయి.

పనసయ్యగారు వేలెట్టి చూపకుండానే కనుసైగమాత్రం చేతనే అవునన్నట్టుగా కనబడి, అమీనాను మరోత్రోవకు తీసికొని వెళ్ళినారు.

తెలుకుల సత్తెయ్య ఆదేం గమనించనేలేదు. ఆరబోసిన పప్పు కాళ్ళతో రాస్తూ మండుటెండలో ఆలోచిస్తూవున్నాడు.

ఆ పప్పు సాయంత్రాని కింటికి జేరబోసికొని రాత్రి నాలుగాటల మీద నూని గావిద్దామని.

పనసయ్యగారు అమీనాను మరోవీధి మార్గంగా దీసికొని వెళ్ళడం తీసుకొనివెళ్ళడం తిన్నగా సత్తెయ్య గానుగదగ్గరకు తీసుకువెళ్ళినారు. "చెయ్యివోయి. అమీనా! జప్తు చెయ్యివోయ్! ఆ యెద్దును" అని గానుగు లాగుతూవున్న యెద్దును చూపించినారు.

గానుగాట అప్పు దెవరాడుతున్నారు? గానుగెద్దు నప్పు దెవరు తోలుతున్నారు? సత్తెయ్య పెళ్లాం ఆడుతూవుంది. ఒయ్యారంగా చిన్న తవుకోల్లాంటి సాధన మెరిసిషోతో వోచేతిలో వుంది. రెండోచేత్తో ఊరికే పప్పును గానుగులోకి తోస్తూవుంది. గానుగు కిర్రుకిర్రు తిరుగుతూవుంది. పనసయ్యగారి కొడుకు ఏడెనిమిదేండ్ల గుంటడు హూంహే అని గానుగు బల్లమీద కూర్చుని ఎద్దును తోల్తూవున్నాడు.

ఎప్పుడైతే పనసయ్యగారి గొంతుకు వినబడిందో అప్పుడు పనసయ్యగారి కొడుక్కి లోపల ప్రాణాలు లోపల్నే ఎగిరిపోయినాయి. "వెధవా! ఇక్కడ తెలుకలాళ్ళ గానుగదగ్గర తెలికపిండి రుచిమరిగి వాళ్లెద్దుని తోల్తున్నావట్రా?" అని చితకామతకా కొట్టేస్తాడేమో తనతండ్రి తనను అన్నభీతే ఆ కుర్రాడికి.

కనిపెట్టింది సత్తెయ్యపెళ్లాం పనసయ్యగారు వచ్చిన రాకడ, అమీనా చేయబోతూవున్న జప్తు అన్నిటికంటే పనసయ్యగారి కొడుక్కి పుట్టుకొచ్చిన గుండె దడానున్నూ. తక్కినవాటి మాటటుంచి వెంటనే ఏంచేసిందీ ఆ అమ్మి? పనసయ్య కొడుకుని చంకనెట్టుకుంది. "అబ్బాయిగారూ! మనెద్దునెవరూ తీసుకుపోరులేండి" అంది.

ఈ సత్తెయ్య పెళ్లాం ఎప్పుడైతే ఎత్తుకుని ఆ ముక్కందో అదివరకు తండ్రి కొడతాడేమో ననేభయం పోయి మరోరకం మానసిక ప్రవృత్తి పిల్లవానిలో కలిగింది. "గానుగెద్దు నెక్కడికో ఎవరో తీసుకుపోతారు" అనే దుఃఖం ఉద్భవిల్లి కళ్ళమ్మట నీళ్ళూరికే కారాయి. ఆ కుర్రాడు తనమొగం సత్తెయ్య పెళ్లాం యొక్క బుజమ్మీద పెట్టి ఒకటే యేడుపు ఒకటే యేడుపు! ఆమె పయటంతా తడిసిపోయింది.

పనసయ్యగారూ అమీనాకూడా ఓ నిమిషం ఆ దృశ్యం చూచారు. ఏమైనా బాకీ వసూలు అయిపోవడం తప్పనిసరి కాబట్టిన్నీ, అది సత్తెయ్యవల్ల గానుగెద్దు రూపేణా తప్ప మరో విధంగా వసూలుకాదు కాబట్టిన్నీ, "ఆ వెధవను నీవు ముందు కిందకుదింపి. మీ యెద్దును గానుగునుండి విప్పెయ్యి-అమీనా గారు దాన్ని జప్తు చేయడానికి వచ్చారు" అన్నారు పనసయ్య గారు సత్తెయ్య పెళ్లాంతో.

సత్తెయ్య పెళ్లాని కదే మొదటితూరి పనసయ్యగార్ని చూడ్డం. పనసయ్యగారి గొంతుక రెండుమూడు పర్యాయములు పీధంట వినబడితే వినబడి వుండొచ్చుగాని అయన ముఖం ఆమెకు కనబడ్డ దావేళే.

సత్తెయ్య పెళ్లాం అంటే అందరి పెళ్లాల్లాంటి పెళ్లాం కాదు. అసలైన పెళ్లాం. కోక కట్టిందన్నా రైక తొడిగిందన్నా అటువంటి నా కోకే కట్టాలి అనుకునేవారు చుట్టుపక్కలవాళ్లు. అవంటి నా రైకే తొడగాలి అనుకునేవారు ఇరుగుపొరుగువాళ్లు. సత్తెయ్య కూడా తన పెళ్లాం వూసు వచ్చినప్పుడు అతి పుపురుసంగా అతి సరసంగా—"నా పెళ్లాం! నా పెళ్లాం!" అని చెప్పొచ్చేవాడు.

అందం అనేది అన్ని కులాల్లోను అన్ని వృత్తుల్లోనూ వుంటుందని చెప్పక తప్పదనుకోండి ఆమెను చూచినతరువాత!

ఆమె ఆ కుర్రవాన్ని కిందకు దింపి కొంచెం ఎడంగా నిలబడి సన్న గొంతుకతో "అమీనాగార్నె విప్పు కెళ్ళమనండి" అంది.

సత్తెయ్య వచ్చేదాకా ఆగండి అ ని అనలేదు. సత్తెయ్య లేకుండా చూచి దొంగల్లాగ తోలుకెళ్ళడానికి మీకేం హక్కు అని ముదలకించలేదు. సత్తెయ్యవుంటే మీపని పట్టివుందును. ఇలా గుమ్మంమెట్టు ఎక్కియుందురా? అని స్వగతంగా నైనా బొమముడి వేసియుండలేదు ఆ యిల్లాలు.

అంత నిర్లిప్తగా ఆమె చెప్పడానికి కారణమేదో వింతైంది వుంది అని చదువరులు అనుకొనేరుగనుక, ఏమీలేదు.

సత్తెయ్యకు అతనిమీద పనసయ్యగారు తెచ్చిన దావా అతనికి వ్యతిరేకమై ఏడెనిమిది నెల్లైంది. సత్తెయ్య పనసయ్య గారికి నూటఇరవై రూపాయిలు ఇవ్వ తేలినాడు. అవి ఎక్కణ్ణుంచి తీసుకురావడానికి వేరే అవకాశంలేదు అతనికి. తానై ఎద్దుని అమ్మలేకపోయినాడు. అమ్మితే మరో ఎద్దును కొనుక్కునే సామర్థ్యంలేదు. అంచేత పనసయ్యగారినే బతిమాలుకుంటూ వచ్చాడు. బాకీ అడగొద్దని, ఆ బాకీ మరో అందుకు, మరో అందుకు తాను చేసిందికాదనీ, ఓ ముండకూ ముట్టకూ పెట్టింది లేదనీ, గానుగు పాతుకైందని, తెలుకులుగానుగంటే సామాన్యపు గానుగ కాదనీ, దానికీ మరోదానికీ పోలికే లేదనీ, మరిన్నీ మరిన్నీ ఎన్నెన్నో ఏకరువు పెట్టేవాడు. ఏకరువుపెట్టి ఎంత కాళ్లావేళ్లాబడ్డా పనసయ్యగా రంగీకరించలేదు. అంచేత పెళ్లాంతో

అదివరకే చెప్పేశాడు సత్తెయ్య-" ఉన్నన్నాళ్లంటుంది ఎద్దు. లేనప్పుడు మాట గదా ఆలోచించుకోవడం మనపని ఎల్లాగునా అని" ఆ కారణంచేత, పనసయ్యగారు అమీనాతోకూడా వచ్చి ఎద్దును జప్తుచెయ్యడం సత్తెయ్య పెళ్లానికి ఏమిన్నీ కొత్త అనిపించలేదు.

పనసయ్యగారు ఎద్దును అమీనాచేత జప్తుచేయించి అమీనాకు తామొక పూచీకత్తు వ్రాసియిచ్చి తమ సొంత జబాబుదారీ మీద ఎద్దును తమదొడ్లోనే కట్టించివేసికొన్నారు.

పనసయ్యగారి కొడుకు ఆకాడేవుండి ఆ జప్తూగిప్తూ అంతా చూచి తమ యింటికే ఆ యెద్దును తోలుకెడుతూ వున్నారని తెలిసికోవడంతోనే ఎద్దుకంటె ముందుగానే తమయింటికి వెళ్ళి తల్లితో అన్నాడు—" అమ్మోయి! గానుగెద్దుని మనదొడ్లో కట్టి వేస్తున్నారేవ్! గానుగెద్దేవ్! గుండ్రంగా ఎంచక్కా తిరుగుతుం దేవ్!" అన్నాడు.

తల్లి "వెధవా! గానుగూలేదు! గానుగెద్దూలేదు. నోరు మూసుకో" అంది. ఆమెలో ఆ జప్తూ గిప్తూ వ్యవహారం ఏమాత్రం సంబరం గొలుపలేదు.

పనసయ్యగారు తన యింటికొచ్చి ఆ యెద్దును తమ దొడ్లో కట్టించి అమీనాను పంపించి ఎప్పట్లాగే నిత్యకృత్యాల్లో పడ్డారు.

సాయంత్రం పడేసరికి సత్తెయ్య తాజేసిన పప్పుతో యింటికి వచ్చాడు. ఇంటి కతగా దొచ్చేసరికి సత్తెయ్య పెళ్లాం కొంగు నట్టింట పరుచుకొని పడుక్కుని వుంది. సత్తెయ్య "ఏమే ఆలా పడుకున్నావు!" అన్నాడు. "మన యెద్దును జప్తుచేసి పనసయ్యగారు తోలించుకు వెళ్ళిపోయినారు. అనుకున్నంతా జరిగింది. ఇక మన బ్రతుకెలాగ?" అంది. సత్తెయ్యకు

ధైర్యం చావలేదు. "ఓసి పిచ్చిదానా! అలా తొంగుంటే గానుగు తిరుగుతుందే? నేను తిప్పుతాగా! ఎద్దుకుమారుగా నేను తిప్పుతానే గానుగ! ఇంతేనా నీ విచారం" అన్నాడు సత్తెయ్య. ఏమంటుంది ఆ పడుచు. లోలోవున్న కుములు లోలోపలే దిగమింగుకుని ఒంటిచేతిమీద లేచి జుత్తు రెండుచేతులా ముడేసుకుని "అంత పప్పా మనకీరాత్రి వల్లపడుతుందంట్రా?" అంది. "పణ్ణంతే ఆయిరి" అన్నాడు సత్తెయ్య.

సత్తెయ్యా సత్తెయ్యపెళ్ళాం ఇద్దరూకూడా గానుగసాల్లోకి వెళ్ళినారు. సత్తెయ్య అడిగాడు "ఎద్దుగంతలుకూడా జప్తుచేసుకుపోయారుటే?" అని. "ఎద్దు మువ్వలుకూడా పట్టుకుపోయినారుటే?" అని. "ఎద్దుకు సంబంధించినవన్నీ పట్టుకుపోయినారు" అంది సత్తెయ్య పెళ్ళాం గానుగెక్కుతూ. సత్తెయ్య గానుగు తిప్పుతూన్నాడు.

రాత్రి రెండోజాము గానుగెద్దు, జప్తు అయిన ఎద్దు, పనసయ్యగారి దొడ్లో కట్టివేయబడ్డ యెద్దు తాడు తెంచుకుని మువ్వలతోటి గంతలతోటి ఎక్కడికో పారిపోయింది. అవి ఊరంతా పుకారు. ఊరంతా బయలుదేరారు. పనసయ్యగారు మునసబుగారు కరణంగారు అందరూకూడా సత్తెయ్య ఏదో మాయోపాయం పన్ని తిరిగి తనయెద్దును తన గానుక్కు కట్టుకుని గానుగ తిప్పుకుంటూ వున్నాడని ఊహించేరు, అంత దూరాన్నుంచి గానుగసాలలో కిర్రు కిర్రు గానుగు తిరుగుతూవున్న చప్పుడవుతూవుంటే—

కాని సాలలోకి వెళ్ళకముందే సాలముందు పనసయ్యగారి కొడుకు "నడువు! గానుగుకాడకు నడువు!" అంటూ గానుగెద్దును సాలలోకి గెంటుతూ వున్నాడు.

ఊరంతా ఆ కుర్రవాని చేష్టచూచి "పనసయ్యగారూ! మీరు జప్తు చేయిస్తే మీ అబ్బాయిగారు జప్తు విడుదల చేయించే రండో!" అని కేకేశారు.

"మరి సాల్లో గానుగెవరు తిప్పుతున్నారు?" అని అడిగేరు పనసయ్యగారు.

"వాళ్ళే కాటోలు మగడు పెళ్ళాలిద్దరూ కామోసు" అన్నారు అంతా.

పనసయ్యగారి కొడుకుమాత్రం కొంచెం తొంగిచూచి "లేదు! సత్తెయ్యవొక్కడే గానుగు లాగుతున్నాడు: పాపం గానుగు లాగుతున్నాడు!" అన్నాడు. ఆ మాటతో లోకానికి కాయకష్టదేవత ప్రత్యక్షమైంది.

## 'లి' గాడు

సర్వ సామాన్యంగా తెనుగువారిచే నుపయోగింపబడుతూన్న "లిగాడు" శబ్దాన్నే విరిచి "లి" గాడుగా మార్చి దానిని సార్థకం గావించే విధంగా ఈ కథలో వాడుతూ వున్నాను. పాఠకులు పరామర్శింతురుగాక! లేరు మరీ "వన్నెకాడు" "అందగాడు" "ఆటకాడు" "పాటగాడు" అని. అట్టివాడే "లి" గాడున్నూ.

"లి"గాడు అనగా—కొడవలి, గొడ్డలి, గుద్దలి, రోకలి, నాగలి, వీనివి పనిముట్లుగా గైకొని శ్రమపడే మగవ్యక్తి. ఎంత శ్రమపడ్డా వాడు సంపాదించే సంపాదన, కలి, అంబలి, ఈ రెండింటినీ మించిన ఆహారాన్ని సంబాళించుకోవడానికి చాలదు. వాడనేమాటల్లో "దాపలి" "వెలపలి" అని వినబడేవి